క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల: మండల కేంద్రంలో వీధిలైట్ల మరమ్మతు కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అప్పల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల రైతులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగి వరి పంట కోతలు మొదలయ్యాయని ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతు



పెంట్లవెల్లి: మండల కేంద్రం నుంచి కొండూరు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పాడ్డాయి. దీంతో ఎస్ఐ రామన్‌గౌడ్ స్పందించి ఆదివారం ట్రాక్టర్ ద్వారా మట్టి తీసుకొచ్చి గుంతలను పూడ్చారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లెవలింగ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు, వాహనదారులు ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు సిబ్బంది రాజన్‌గౌడ్, మహేష్, పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం జిల్లాకేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సంచార జాతుల వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సెక్రెటరీ రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీధర్, కుమార్, అనురాధ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా మురుగుకాల్వలు



తాడూరు: మండల కేంద్రంలోని రెండో వార్డులో మురుగుకాల్వలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చెత్తచెదారంతో మూసుకుపోయి దుర్గంధభరితమైన వాసన వెదజల్లుతోంది. ప్రత్యేకాధికారుల పాలనలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కార్యదర్శుల పర్యవేక్షణ కరువై అభివృద్ధి కుంటుబడిపోతోంది. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మురుగుకాల్వలు శుభ్రం చేయడంతో అధికారులు నిర్లక్ష్య వైఖరీ అవలంభిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ సయ్యద్, ఉపాధ్యక్షుడిగా కార్తీక్, రాజేష్, లలిత, జిల్లా కార్యదర్శిగా ఎం తారాసింగ్‌నాయక్, సహాయ కార్యదర్శిగా తరుణ్, తేజ, సమీర్‌తోపాటు 22 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలన్నారు. తాగు, సాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు శివ, విష్ణు తదితరులున్నారు.

‘పోడు’కు పట్టాలు వచ్చేనా?

- ఇబ్బందులు పడుతున్న దళితులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మలబస్వాపురం శివారులో కుడికిల్ల దళితులు సాగు చేసిన పోడు భూమి

కొల్లాపూర్ రూరల్: దశాబ్దాలు గడుస్తున్న దళితులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. మండలంలోని కుడికిల్ల నార్లాపూర్, ముక్కిడిగుండం, ఎర్రగట్టు బొల్లారం, మొలచింతలపల్లి, రామాపురం తదితర గ్రామాల్లో ఉన్న దళితులు గత 40, 50 సంవత్సరాల నుంచి గ్రామాల సమీపంలో ఉన్న ఫారెస్టు భూములను సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. కాని నేటికి ప్రభుత్వం పట్టాలివ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం స్థానిక ఫారెస్టు అధికారులు సాగు చేసుకుంటున్న భూముల దగ్గరకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుడికిల్ల గ్రామానికి చెందిన దళిత రైతులు నార్లాపూర్ సమీపంలో ఉన్న మల బస్వాపురం శివారులో 36 సర్వే నెంబర్‌లో దాదాపుగా 60 కుటుంబాల వారు 50 సంవత్సరాల నుంచి 120 ఎకరాలు భూమిని సాగు చేస్తున్నారు. కాని నేటి వరకు వారికి ప్రభుత్వం పట్టాలివ్వలేదు. నార్లాపూర్ గ్రామ దళితులు, ఆ గ్రామ శివారులో దాదాపుగా 30 ఎకరాలు, సాగు చేసుకుంటున్నారు. ముక్కిడిగుండంలో 20 ఎకరాలు, మొలచింతలపల్లిలో 100 ఎకరాలు, రామాపురంలో దాదాపు 40 ఎకరాలు ఎర్రగట్టు బొల్లారంలో 60 ఎకరాలు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలిచ్చి అందుకున్నది. కాని దళితులకు మాత్రం పట్టాలు ఇవ్వలేదు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని సాగు చేసుకుంటున్న భూమిలేని దళితులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే సాగు చేసుకుంటున్న భూములపై ఫారెస్టు అధకారులు చేస్తున్న దాడులను ఆపాలని వారు కోరుతున్నారు.

పట్టాలిచ్చి ఆదుకోవాలి

నార్లాపూర్ గ్రామ సమీపంలో మల బస్వాపురం శివారులో దాదాపుగా 1955 నుంచి పోడు భూమిని సాగు చేసుకుంటున్నాం. కాని నేటి వరకు ప్రభుత్వం పట్టా ఇవ్వలేదు. ప్రభుత్వం పట్టాలిచ్చి ఆదుకోవాలి. ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– కోంద్ర బిచ్చయ్య, రైతు, కుడికిల్ల

నాలుగు దశాబ్దాలుగా..

1982 సంవత్సరంలో గ్రామం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైంది. అప్పటి నుంచి ఎర్రగట్టు దగ్గర గుడిసెలలో ఉంటూ పోడు భూమిని సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాం. కాని ప్రభుత్వం ఇప్పటివరకు పట్టాలివ్వలేదు. మంత్రి జూపల్లి ప్రత్యేక చర్యలు తీసుకొని పట్టాలు ఇచ్చి ఆదుకోవాలి.

– చంటి, రైతు, ఎర్రగట్టు బొల్లారం

ప్రభుత్వ విప్‌కు ఘన సన్మానం



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయికులు

వెల్దండ: మండల కేంద్రంలో ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వ విప్ శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తూ మార్గమధ్యలో ఉన్న మాజీ సర్పంచ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో పూర్తిగా అమలు చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సింగల్‌విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్‌యాదవ్, జంగయ్యయాదవ్, నాయకులు సంజీవరెడ్డి, కిషోర్‌రెడ్డి, ఆంజనేయులు, రాజయ్య, తదితరులు ఉన్నారు.

సామాజిక సేవే వాసవీక్లబ్ ధ్యేయం



మాట్లాడుతున్న రమేష్‌బాబు

కల్వకుర్తిరూరల్: సామాజిక సేవయే వాసవీక్లబ్ ధ్యేయమని క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. వాసవీక్లబ్ గోల్డెన్ స్టార్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన కార్యవర్గం సభ్యులను గవర్నర్ సూరిశెట్టి నర్సింహ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా వీరభద్రరావు, కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా ఆనంద్‌కుమార్‌లు ప్రమాణస్వీకారం చేశారు. సమావేశంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ కల్మిచర్ల రమేష్ మాట్లాడుతూ సామాజిక సేవలను మరింత ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో జూలూరి రఘు, కల్మిచర్ల రమేష్, బెజుగం రమేష్, వాడకట్టు విజయ కుమార్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నవంకేశ్వరం నిరంజన్

నాగర్‌కర్నూల్ క్రైం: భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని రచయిత దొండి లక్ష్మీ నారాయణ అన్నారు. ఆయన రచించిన ‘భారత రాజ్యాంగం-ఒక విశ్లేషణ’ అనే పుస్తకాన్ని పూలే అంబేడ్కర్ అధ్యయన వేదిక, సమతా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జై భీమ్ దీక్ష వ్యవస్థాపక అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మాట్లాడుతూ అగ్ర కులస్తులు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బహుజనులు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కవి గుడిపల్లి నిరంజన్, వార్డెన్ చెన్నయ్య, పెద్దన్న, డీటీయూ జిల్లా కన్వీనర్ కొంగరి జానయ్య, చంద్ర సిద్ధార్థ పాల్గొన్నారు.

మైసమ్మ జాతరలో భక్తుల సందడి



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో జాతర ప్రాంగణం కిటకిటలాడింది. వేసవికాలం రావడంతో రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. 20 వేల వరకు భక్తులు దర్శించుకునట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన చిత్తనూరు సునీత ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. అంత్యక్రియల నిమిత్తం గ్రామానికి చెందిన మారేపల్లి సురేందర్‌రెడ్డి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే ఎస్సీ వర్గీకరణ

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్‌తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్ మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ మల్లు రవి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం వర్గీకరణతో మాదిగలను మభ్యపెడుతుందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వర్గీకరణ చేపట్టాలన్నారు. మాజీ జెడ్పీటీసీ వంకేశ్వరం మన్నెమ్మ లక్ష్మయ్య, దేవరకొండ రామచంద్రయ్య ఉన్నారు.

ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు

- నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



లింగాల శివారులో ఒండ్రుమట్టి నిల్వలు



లింగాల శివారులో ఇటుకల తయారీ పరిశ్రమ

లింగాల: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అధికారుల అనుమతి తీసుకోకుండా నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. లింగాల శివారులోని తెల్కపల్లి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 10కి పైగానే ఇటుక బట్టీలు కొనసాగుతున్నాయి. అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలకు తావిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇటుక బట్టీ ఏర్పాటుకు మైనింగ్, గ్రామ పంచాయతీ అనుమతులతో పాటు, పర్యావరణ, లేబర్ ఆఫీసు నుంచి అనుమతులు తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తప్పనిసరి. కాని ఇవేవి పట్టించుకోకుండా నియమనిబంధనలకు విరుద్ధంగా బట్టీల యజమానులు ఇటుకల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. మట్టి ఇటుకలతో పాటు సిమెంట్ ఇటుకలను సైతం తయారు చేస్తూ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు.

యథేచ్ఛగా ఒండ్రుమట్టి సేకరణ

ఇటుకల తయారీకి ముడి సరకు అయిన ఒండ్రుమట్టిని సేకరించి నిల్వ ఉంచుకుంటున్నారు. వేసవిలో చెరువులు, కుంటల నుంచి రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఒండ్రుమట్టిని తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కాగా బట్టీల దగ్గర పని చేయుటకు సుదూర ప్రాంతాల నుంచి లేబర్‌ను తీసుకొస్తున్నారు. మండలంలోని ఎర్రపెంట, శ్రీరంగాపూర్ తదితర చెంచు పెంటల నుంచి పనులలో చెంచులను వాడుకుంటున్నారు. బట్టీల దగ్గర పని చేసే కూలీల వివరాలు లేబర్, రెవెన్యూ కార్యాలయంలో ఉండాలి. కాని బట్టీల యజమానులు అవేమి పట్టించుకోకుండా పని చేయించుకుంటున్నారు.

అనుమతులు తప్పని సరి

ఇటుక బట్టీల నిర్వాహకులు ఆయా శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తాం.

– ఉమ, తహసీల్దార్, లింగాల

ఘనంగా వన మహోత్సవం



చంద్రాయన్‌పల్లిలో సహపంక్తి భోజనాలు చేస్తున్న కుటుంబ సభ్యులు

వెల్దండ: మండలంలోని కేస్లీతండా, తుమ్మలకుంట తండా, మర్రిగుంతతండా తదితర గ్రామాల్లో ఆదివారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి కుటుంబ సమేతంగా వనానికి బయలుదేరారు. అక్కడే వంటవార్పు చేసి వనదేవతలకు నైవేద్యం సమర్పించి పాడిసంపద, పంటలను కాపాడాలని వేడుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు తదితరులు ఉన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. పొలం గట్లపై తిరుగుతూ ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమాల్లో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యే అనిరుధ్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

ఊర్కొండ: ముస్లింల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వంగా సంతోష రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలకు వాసవీ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలతో పాటు వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ముస్లింలు పాల్గొన్నారు.

లీకేజీని అరికట్టాలి



తాడూరు: మండల కేంద్రంలోని ఎర్రకుంట చెరువు కట్టను అనుసరించుకుని ఉన్న వార్డుల్లో పైప్‌లైన్ లీకేజీ అయ్యి నీరు వృథాగా పోతోంది. దీంతో పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. ట్రాక్టర్ల ద్వారా ఒండ్రుమట్టి తరలిస్తుండగా లీకేజీ అవుతున్న పైప్‌లైన్ దగ్గర ఒండ్రుమట్టి కొద్దిమొత్తం కిందపడుతుండటంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి లీకేజీని అరికట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

సంప్రదాయ దుస్తుల పంపిణీ



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయం ప్రాంగణంలోని జ్ఞానేశ్వర అరక్షిత బాలుర ఆశ్రమంలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా సాంప్రదాయ దుస్తులను అందజేశారు. ఆదివారం జ్ఞాన వికాస భారతి సంస్థ ఆధ్వర్యంలో అచ్చంపేటకు చెందిన కంచర్ల ఆనంద్, విక్రంత్‌లు 15 మంది అనాథ బాలలకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలను మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో జ్ఞాన వికాస భారతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడు సోమ ప్రగతి గౌడ్, ప్రధాన కార్యదర్శి సుధారాణి, ప్రచార కార్యదర్శి సురేందర్ జ్ఞానేశ్వర్, ఆశ్రమ ట్రస్టు కన్వీనర్ ఆకారపు విశ్వనాథం, ఆశ్రమ నిర్వాహకులు దొడ్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకుని నూతన పంచాంగం ఆవిష్కరించారు. అనంతరం ఉచితంగా పంపిణీ చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. చంద్రమౌళి, విష్ణుమూర్తి, మల్లాచారి, సీతారాములు, చంద్రమోహన్, నాగరాజు, లింగాచారి, ఉమా శంకర్, రఘు, విజయ్, వీరాచారి, భీమాచారి, మాధవాచారి, తేజస్విని, కల్పన, విద్యావతి, అనూష పాల్గొన్నారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు



రోడ్డుపైనే బస్సులు నిలుపుతున్న డ్రైవర్లు

తాడూరు: మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండేళ్ల కిందట బస్‌షెల్టర్‌ను తాత్కాలికంగా నిర్మించారు. దీనిని ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఆర్టీసీ ప్రయాణికులు ఎండలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిలబడి వేచి చూస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు నరకయాతన అనుభివిస్తున్నారు. మండల కేంద్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పాలకులు హామీలు ఇస్తున్నారే తప్పా అమలు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బస్టాండ్ నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి కనీసం రెండేళ్ల కిందట నిర్మించిన బస్ షెల్టర్‌నైనా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

కేసులు నమోదు

లింగాల: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరు మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆదివారం అంబట్‌పల్లి సమీపంలోని రాయవరం చౌరస్తాలో వాహనాలను తనఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించొద్దని కోరారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో ఆదివారం గ్రామానికి చెందిన మాడ్గుల నిరంజన్ నుంచి మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

ఐదుగురిపై ..

బల్మూర్: మండలంలోని కొండారెడ్డి పల్లి, పోలిశెట్టి పల్లి గ్రామాల్లో జరిగిన రెండు వేర్వేరు ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. కొండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన శీలం మంగమ్మపై ఈనెల 6న శనివారం అదే గ్రామానికి చెందిన కుర్మయ్య దాడి చేసి గాయపర్చిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని పోలిశెట్టిపల్లి శివారులోని రవీందర్‌గౌడ్ ఇటుక దుకాణం వద్ద ఉన్న నజీర్‌పై శనివారం రాత్రి లింగోటం తండాకు చెందిన పవన్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన విషయంలో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.